క్లుప్తంగా

ఘనంగా ఆలయ ప్రథమ వార్షికోత్సవం



హోమం జరిపిస్తున్న ఆలయ కమిటీ, భక్తులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి తలారివానిపాలెం గ్రామంలోని వినాయక, సీతారామంజనేయ సహిత షిర్డీ సాయి దేవాలయం ప్రథమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తలారివానిపాలెం, దిబ్బపాలెం , దానబోయినపాలెం గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని విశేష పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో హోమం జరిపించారు. గ్రామ నాయకులు తలారి వెంకటరమణ, తలారి నాగరాజు దంపతులు పూజలు చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కొలిపాక అప్పారావు, తోకాడ రాము, బలిరెడ్డి సత్యనారాయణ, దొడ్డి దేముడు, గంధోళి పైడికొండ, కె.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సాయం



మృతుని కుటుంబానికి సాయం అందిస్తున్న తూర్పుకాపు సంఘం నాయకులు

అగనంపూడి: వడదెబ్బకు మృతి చెందిన ఆటో డ్రైవర్ కుటుంబానికి పరవాడ మండల తూర్పు కాపు సంక్షేమ సంఘం ప్రతినిధులు ఆర్థిక సహాయం అందించారు. 85వ వార్డు డొంకాడ కాలనీకి చెందిన చంద్రపాటి బొరయ్య 20 రోజుల క్రితం అగనంపూడి బస్టాప్ కూడలిలో వడదెబ్బకు గురై మృతి చెందాడు. స్పందించిన కాపు సంక్షేమ సంఘం ప్రతినిధులు అసోసియేషన్ తరపున మృతుని భార్య లక్ష్మికి రెండు నెలలకు సరిపడా బియ్యం, నిత్యావసర సరకులు, రూ.ఐదు వేల నగదును అందించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఎం .రమేష్, బి.సత్యనారాయణ, జి.శ్రీను, ఆర్.శ్రీనివాస్ కుమార్, పి.వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదగంట్యాడ: పిట్టవానిపాలెం 11కేవీ, గాజువాక 11కేవీ ఫీడర్ మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని ఏపీఈపీడీసీఎల్ జోన్–2 ఈఈ బీకే నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా పిట్టవానిపాలెం పరిధిలోని పిట్టవానిపాలెం, కేఎన్ పాలెం, పెదపాలెం, చినపాలెం, అష్రఫ్‌నగర్‌తో పాటు గాజువాక పరిధిలోని వికాస్‌నగర్, బీసీ రోడ్డు, భవానీనగర్, ప్రియదర్శినీ కాలనీ, వాంబే కాలనీ, బాపూజీ కాలనీ, సంజీవకాలనీ, నేతాజీ కాలనీ, న్యూ దిబ్బపాలెం, యాతపాలెం తదితర ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు గమనించాలని కోరారు.

మాజీ సైనికుడు బస పెంటయ్యకు నివాళి



బస పెంటయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వెంకట రమణారెడ్డి

పెదగంట్యాడ: మాజీ సైనికుడు బస పెంటయ్య సేవలు మరువలేమని నిర్వాసితుల సంఘం నాయకుడు పులి వెంకటరమణారెడ్డి అన్నారు. బస పెంటయ్య సంస్మరణ సభను నెల్లిముక్కలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ముద్దుర్తి శ్రీరామ్మూర్తి, నీలాపు సోమరెడ్డి, గొందేశి పెంటయ్యరెడ్డి, బస అప్పలస్వామి, అప్పలరెడ్డి, పులి సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ విద్యార్థి గ్లోబల్ సిటిజన్ కావాలని..

- సీఎం జగన్‌మోహన్ రెడ్డి తపన
- పేద విద్యార్థులకు భరోసానిస్తూ ఎన్నో పథకాలు
- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి వెల్లడి
- 'పది' లో ప్రతిభావంతులకు ప్రోత్సాహకాలు



ఇంటర్ విద్యార్థిని డి.సాయిహర్షిణిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి



ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా విద్యార్థిని కెజియాను సత్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: అభివృద్ధి చెందిన దేశాల సరసన ఆంధ్రప్రదేశ్‌ను నిలబెట్టేందుకు రాష్ట్రప్రభుత్వం విద్యారంగంపై దృష్టి సారిస్తోందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. ప్రతీ విద్యార్థిని గ్లోబల్ సిటిజన్‌గా తయారు చేసేందుకు వేల కోట్ల రూపాయలను విద్యా రంగానికి కేటాయిస్తున్నారన్నారు. పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆణిముత్యాలు నియోజకవర్గ స్థాయి కార్యక్రమాన్ని నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే నాగిరెడ్డి పదో తరగతి, ఇంటర్‌లో అత్యున్నత ప్రతిభ కనబర్చిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, సంబంధిత విద్యాలయాల ప్రధానోపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. నియోజకవర్గ స్థాయిలో ప్రతిభ కనబరిచిన ఏడుగురు విద్యార్థినీ, విద్యార్థులకు రూ.80వేలు నగదు, జ్ఞాపికలను అందజేశారు. దుశ్శాలువలతో సత్కరించారు.

ఇంటర్‌లో 972 మార్కులతో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచిన దేవరకొండ సాయి హర్షిణి, చెల్లుబోయిన మాధవికి రూ.15వేలు వంతున అందజేశారు. పాఠశాల స్థాయి, నియోజకవర్గ స్థాయిలో 586 మార్కులు సాధించిన నడుపూరు, కణితి పాఠశాలలకు చెందిన బి.జ్యోతి స్వరూప అంజలి, పితాని కెజియాలకు రూ.15వేలు వంతున, ద్వితీయ స్థానంలో నిలిచిన గాజువాక పాఠశాలకు చెందిన శ్రీనాథు వర్షిణికి రూ.10వేలు, తృతీయ స్థానంలో నిలిచిన నడుపూరు, కణితి పాఠశాలలకు చెందిన దత్తానంద కిశోర్, సీహెచ్ వెంకట రామ్‌చరణ్‌లకు రూ.5వేలు వంతున అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న ఆణిముత్యాలు పేరిట ప్రతిభావంతులకు నగదు ప్రోత్సాహకాలు అందించడం ఇతర విద్యార్థులకు స్ఫూర్తినిస్తుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువస్తూ వినూత్న పథకాలతో దేశంలోనే ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. అనంతరం జగనన్న విద్యా కానుక కిట్లను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి సత్యనారాయణ, అగనంపూడి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సునీల్‌కుమార్, పెదగంట్యాడ ఎంఈవో పైడపునాయుడు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు రాచకొండ శ్రీనివాస్, కృష్ణారావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

జీవీఎంసీ పారిశుధ్య కార్మికుల ధర్నా

గాజువాక : పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జీవీఎంసీ గాజువాక జోనల్ పారిశుధ్య కార్మికులు గురువారం ధర్నా నిర్వహించారు. జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా అనంతరం నాయకులు జోనల్ కమిషనర్ పి.సింహాచలంను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్మికుల సమస్యలను ఈ సందర్భంగా యూనియన్ నాయకులు రాజు, గొలగాని అప్పారావు వివరించారు. 482 డెత్, సిక్, 60కి పైగా లాంగ్ ఆబ్సెంట్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. కేటగిరీ ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు. క్లాప్ ఆటో డ్రైవర్ల వేతనం రూ.18,500 చెల్లించాలని, బదిలీ కార్మికుల వారసులను ఆప్కోస్‌లో నమోదు చేయాలని కోరారు. ఈ సమస్యలను ఈ నెల 18లోగా పరిష్కరించాలని, లేనిపక్షంలో 19వ తేదీ నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎం.రాంబాబు, కె.ఎం.శ్రీను, కోరి అప్పలరాజు, రాము తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ హాలు నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న నాయకులు

కూర్మన్నపాలెం : జీవీఎంసీ 87వ వార్డు వడ్లపూడి భవిత దివ్యాంగుల కేంద్రం ప్రాంగణంలో దివ్యాంగ పిల్లల కోసం ప్రత్యేక ఫిజియోథెరపీ హాలు నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. అభయ ఫౌండేషన్, స్పందన ఫౌండేషన్ల సహకారంతో చేపట్టనున్న నిర్మాణ పనులను కార్పొరేటర్ బొండా జగన్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఫిజియోథెరపీ హాలు అందుబాటులోకి వస్తే వార్డులోని దివ్యాంగులకే కాకుండా గాజువాక పరిసర ప్రాంతాల్లోని వారికి కూడా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. హాలు నిర్మాణానికి సహకరిస్తున్న అభయ ఫౌండేషన్ అధ్యక్షుడు ఈపూరి బుచ్చిరాజు, స్పందన ఫౌండేషన్ అధ్యక్షుడు కలిదిండి రవికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో లీ ఫార్మా డైరెక్టర్ లీలారాణి, ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీనివాసరావు, జిల్లా కో–ఆర్డినేటర్ అబ్దుల్లా ఆశ, కొచ్చర్లపాటి రామరాజు, స్థానిక నాయకులు బెల్లంకొండ రాజన్ రాజు, విజయరామరాజు, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో రాత్రివేళ మాక్ డ్రిల్



క్షతగాత్రులను తరలిస్తున్న సిబ్బంది

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యుటిలిటీస్ విభాగంలో బుధవారం రాత్రి మాక్ డ్రిల్ నిర్వహించారు. విభాగంలో అత్యవసర సన్నద్ధతకు పరీక్షించేందుకు రాష్ట్ర జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జె. శివశంకరరెడ్డి ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. విభాగంలోని ఎయిర్ సెపరేషన్ ప్లాంట్‌లోని లిక్విడ్ నైట్రోజన్ ట్యాంక్ నుంచి నైట్రోజన్ లీకేజీ జరిగినట్టు ప్రకటించారు. ఈ ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు కాలిన గాయాలు, ఊపిరాడకుండా కింద పడిపోగా.. ఉద్యోగులు బిగ్గరగా కేకలు వేయడంతో కంట్రోలర్ ఫైర్ విభాగం, మెడికల్ సర్వీసెస్, గ్యాస్ సేఫ్టీ, ప్లాంట్ సేఫ్టీ, పర్యావరణ విభాగాల అధికారులకు సమాచారం అందించారు. ఫైర్ విభాగం సకాలంలో చేరుకుని రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. అంబులెన్స్‌లో వారిని ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీ మేనేజర్ ఎం.ఎస్.వి. కృష్ణయ్య, భద్రతా విభాగం జీఎం ఎస్.కె. రౌత్, ఆయా విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సీజీఎంకు 'ఇంటక్' అభినందనలు



స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ సీజీఎం గాంధీని సత్కరిస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ సీజీఎం జి. గాంధీని కోరారు. హెచ్‌ఆర్ సీజీఎంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా అసోసియేషన్ నాయకులు ఉక్కు పరిపాలన భవనంలో ఆయనను కలిసి అభినందించారు. నాయకులు మాట్లాడుతూ కార్మికులకు నూతన వేతన ఒప్పందం అమలు చేయాలని, ఈఎల్ ఎన్‌క్యాష్‌మెంట్, ఎల్‌టీసీ, ఎల్‌టీఏలు కార్మికులందరికీ పునరుద్ధరించాలని కోరారు. బీఎఫ్–3లో ఉత్పత్తిని పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్, నీరుకొండ రామచంద్రరావు, కారు రమణ, కొమ్ము ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

మత్తు పదార్థాల నియంత్రణపై స్పెషల్ డ్రైవ్



విశాఖ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న జీఆర్పీ సిబ్బంది

తాటిచెట్లపాలెం: మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల నియంత్రణ కోసం విశాఖ రైల్వేస్టేషన్‌లో గవర్నమెంట్ రైల్వే పోలీసులు గురువారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీస్ రాహుల్ దేవ్, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీస్ బి.మోహనరావుల ఆదేశాల ప్రకారం రైల్వే స్టేషన్‌లోని పలు ప్లాట్‌ఫారాలపై ఈ కార్యక్రమం చేపట్టారు. మత్తుపదార్థాలు కుటుంబాలను ఎలా చిన్నాభిన్నం చేస్తాయో, వాటి వినియోగం, రవాణా చేయ డం వల్ల ఎలాంటి పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుందో జీఆర్పీ సిబ్బంది ప్రయాణికులకు వివరించారు. మత్తు పదార్థాలు కలిగి ఉండటం, రవాణా చేయడం నేరమని, ఇటువంటి నేరాలకు పాల్పడిన వారిని కఠిన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. జీఆర్పీ సీఐ కోటేశ్వరరావు, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా కళాశాల విద్యార్థినికి గోల్డ్‌మెడల్

డాబాగార్డెన్స్: ఇండియన్ రోప్ స్కిప్పింగ్ ఫెడరేషన్ ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు ముంబైలో నిర్వహించిన నేషనల్ రోప్ స్కిప్పింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థి బి.కృష్ణవేణి స్పీడ్ స్ప్రింట్ 30 సెకండ్స్ ఈవెంట్‌లో గోల్డ్ మెడల్ సాధించింది. డబుల్ అండర్ 30 సెకండ్స్ ఈవెంట్‌లో సిల్వర్ మెడల్ సాధించింది. కళాశాలలో గురువారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శోభారాణి పాల్గొని కృష్ణవేణిని అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.కిరణ్మయి, కళాశాల ఎకనామిక్స్ విభాగాధిపతి డాక్టర్ కేవీఎల్ శిరీష, బోటనీ విభాగాధిపతి డాక్టర్ ఏహెచ్‌డీ పుష్పలత, కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు కృష్ణవేణిని అభినందించారు.

శ్మశానవాటిక అభివృద్ధి పనుల పరిశీలన

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు అక్కిరెడ్డిపాలెం శ్మశానవాటిక అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. రూ.1.14 కోట్ల వ్యయంతో చేపడుతున్న అభివృద్ధి పనులను వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్ గురువారం పరిశీలించారు. జీవీఎంసీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. శ్మశానవాటిక సర్వే నిర్వహించి సరిహద్దుల్లో ప్రహరీ గోడతో పాటు ప్లాట్‌ఫాం వంటి పనులు చేపడుతున్నట్లు లతీష్ తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర ప్రధాన కార్యదర్శి సంగ్రాన నూకరాజు, నాయకుడు సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న విద్యా కానుక పంపిణీ



తుంగ్లాం పాఠశాలలో విద్యార్థికి జేవీకే కిట్ అందిస్తున్న కార్పొరేటర్ గోవిందరెడ్డి

అక్కిరెడ్డిపాలెం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి అన్నారు. వార్డు పరిధి తుంగ్లాం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు గురువారం జగనన్న విద్యా కానుక కిట్లను కార్పొరేటర్ అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎస్.సుజాతా దేవి, ఎ.ఉమ, ఎస్.లక్ష్మి, గిడితూరి అప్పారావు, కాకి రామి రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

యువకుడు అదృశ్యం



సయ్యద్ ఇబ్రహీం (ఫైల్)

అక్కిరెడ్డిపాలెం: యువకుడి అదృశ్యంపై గాజువాక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. గాజువాక సీఐ ఎల్.భాస్కర రావు తెలిపిన వివరాలివి.. దయాల్‌నగర్, పెదగంట్యాడకు చెందిన సయ్యద్ ఇబ్రహీం (17) ఈ నెల 10వ తేదీన బీసీ రోడ్డులో తన తండ్రికి చెందిన జ్యూస్ షాపు నుంచి రాత్రి 7 గంటల సమయంలో స్నేహితుడి పుట్టినరోజు కేక్ కటింగ్ ఉందని చెప్పి వెళ్లాడు. అప్పటి నుంచి తిరిగి రాకపోవడంతో యువకుడి తల్లిదండ్రులు గాజువాక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు గాజువాక పోలీస్ స్టేషన్‌కు 73660 13112 నంబర్‌లో తెలియజేయాలని కోరారు.

సిరులతల్లికి ఘనంగా సహస్ర తులసీపూజ

దాబాగార్డెన్స్: బురుజుపేటలోని కనకమహాలక్ష్మి అమ్మవారికి గురువారం సహస్ర తులసీపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అలాగే పంచామృతాభిషేక సేవా, శ్రీచక్రానవవర్ణార్చన లక్ష్మీహోమంలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి తిరుమలేశ్వర రావు, ఆలయ పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

దిశ యాప్‌పై విస్తృత ప్రచారం



మహిళలు, విద్యార్థినులకు దిశ యాప్‌పై అవగాహన కల్పిస్తున్న ద్వారకా పోలీసులు

సీతమ్మధార: మహిళల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన దిశ యాప్‌పై పోలీసులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్ పరిధి శ్రీనగర్‌లో గురువారం మహిళలు, విద్యార్థినులు, యువతీ యువకులకు అవగాహన కల్పించి వారి సెల్‌ఫోన్‌ల్లో యాప్‌ను డౌన్‌లోడ్ చేయించారు. సీఐ సిహెచ్.సింహాద్రినాయుడు ఆదేశాల మేరకు ద్వారకా మహిళా పోలీసులతోపాటు కానిస్టేబుళ్లు శ్రీనగర్, రామాటాకీస్, సత్యం జంక్షన్, గురుద్వారా ప్రాంతాల్లో దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి రిజిస్టర్ చేయించారు. వ్యక్తిగత వివరాలను గోప్యంగా ఉంచుతామని పోలీసులు తెలిపారు. ఆపద సమయంలో పోలీస్ వారి తక్షణ సహాయం దిశ ఎస్‌వోఎస్ బటన్ ప్రెస్ చేసిన వెంటనే కంట్రోల్ రూమ్‌కు సమాచారం వెళుతుందన్నారు. బటన్ ప్రెస్ చేయలేని స్థితిలో ఉంటే, ఫోన్ గట్టిగా అటూ ఇటూ ఊపినా పోలీసులకు సందేశం చేరుతుందని , పోలీసులు వెంటనే అక్కడికి వచ్చి సహాయం అందిస్తారని చెప్పారు.

దుర్గాదేవి పండగ పోస్టర్ ఆవిష్కరణ



పండగ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు కాకతీయ లోవలో కొలువుదీరిన దుర్గాదేవి జాతర మహోత్సవాలను ఈ నెల 18 నుంచి 20 వరకు నిర్వహించనున్నారు. ఉత్సవాల పోస్టర్‌ను బీసీ రోడ్డులోని టీఎన్ఆర్ ఫంక్షన్ హాల్లో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు, వైఎస్సార్ సీపీ 64వ వార్డు అధ్యక్షుడు ధర్మాల శ్రీను, మద్దాల అప్పారావు, నాగిశెట్టి శ్రీను, లోకనాథరావు, బైపిల్లి గాంధీ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంపై అవగాహన కల్పించాలి



విజేతకు బహుమతి అందజేస్తున్న సీఐఎస్ఎఫ్ కమాండెంట్ హనీఫ్

ఉక్కునగరం: రక్తదానానికి ముందుకు వచ్చేలా అవగాహన కల్పిస్తూ, ప్రజలను ప్రోత్సహించాలని స్టీల్‌ప్లాంట్ సీఐఎస్ఎఫ్ కమాండెంట్ అత్తార్ మహ్మద్ హనీఫ్ అన్నారు. ఉక్కు జనరల్ ఆస్పత్రిలో గురువారం నిర్వహించిన ప్రపంచ రక్తదాతల దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. రక్తదానంపై ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ఉద్యోగులు, ఆస్పత్రికి వచ్చిన రోగులు సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జనరల్ ఆస్పత్రి సీజీఎం డాక్టర్ కె.హెచ్. ప్రకాశ్, వైద్యులు డాక్టర్ నవీన్‌కుమార్, డాక్టర్ సారంగి, డాక్టర్ ఎ. శాంతిప్రియ తదితరులు పాల్గొన్నారు.


ఉక్కు పోరాటం భావితరాలకు మార్గదర్శకం



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు..ఆంధ్రుల హక్కు నినాదంతో సాధించుకున్న స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం చేస్తున్న పోరాటం భావితరాలకు మార్గదర్శకంగా మారుతుందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 854వ రోజు, గురువారం సంస్థలోని పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను 100 శాతం అమ్మాలనే నిర్ణయాన్ని తక్షణమే విరమించుకోవాలన్నారు. ఎంతో మందికి ప్రత్యక్షంగా, లక్షల మందికి పరోక్షంగా ఆర్థిక, సామాజిక న్యాయం చేస్తున్న విశాఖ ఉక్కును కాపాడుకోవడానికి అనేక రూపాల్లో ఆందోళనలు చేస్తున్నారన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వరంగంలోనే కొనసాగిస్తామని ప్రధాని స్పష్టమైన ప్రకటన చేయాలని, లేనిపక్షంలో తమ ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

రేయింబవళ్లు విద్యుత్ వెలుగులు



కొండయ్యవలసలో పగలు వెలుగుతున్న వీధి దీపాలు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు కొండయ్యవలసలోని పలు ప్రాంతాల్లో రేయింబవళ్లు వీధి దీపాలు వెలుగుతూనే ఉన్నాయి. కొండయ్యవలస ప్రధాన రహదారి, హైస్కూల్ రోడ్డు, మయూరి కిరాణా దుకాణం ప్రాంతాల్లోని వీధుల్లో నెల రోజుల నుంచి కొన్ని స్తంభాలకు అమర్చిన వీధి దీపాలు నిరంతరంగా వెలుగుతున్నాయి. మరికొన్ని చోట్ల మూడు మాసాలుగా వీధి దీపాల మరమ్మతుల కారణంగా అంధకారం నెలకొంది. పలుమార్లు వార్డు సచివాలయం, జీవీఎంసీ సిబ్బందికి ఫిర్యాదు చేశామని, ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని స్థానికులు తెలిపారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

'హిందూజా' కాలుష్యంపై ఆర్డీవో విచారణ



పాలవలస గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆర్డీవో హుస్సేన్ సాహెబ్

పెదగంట్యాడ: హిందూజా నేషనల్ పవర్ ప్లాంట్ నుంచి పాలవలస గ్రామం మీదుగా బొగ్గు, యాష్ తరలించడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులపై జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందజేయనున్నామని ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ తెలిపారు. జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని పాలవలస గ్రామస్తులు.. తమ గ్రామం కాలుష్యం కోరల్లో చిక్కుకుందని, అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతూ ఇటీవల స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ పాలవలస గ్రామంలో గురువారం పర్యటించారు. గ్రామస్తులతో మాట్లాడగా వారు అక్కడి పరిస్థితులను వివరించారు. హిందూజా పవర్ ప్లాంట్ కారణంగా ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం వందలాది లారీలు రాకపోకలు సాగిస్తుండడంతో తమ గ్రామంపై దుమ్ము, ధూళి ఎగసి పడుతోందని, అనారోగ్య సమస్యలతో సతమతం అవుతున్నామని తెలిపారు. యాష్ వల్ల తమ గ్రామంలో పచ్చని జీడి మామిడి తోటలు ఎండిపోతున్నాయని, ఫలసాయం లేకుండా పోతుందన్నారు. ఇళ్లలోకి దుమ్ము, ధూళి వస్తుండడంతో ఆహార పదార్థాలు కలుషితమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవడంతో పాటు జీడి మామిడి రైతులకు నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని విన్నవించారు. స్పందించిన ఆర్డీవో దీనిపై నివేదిక తయారు చేసి కలెక్టర్‌కు అందజేస్తామని చెప్పారు, కలెక్టర్ ఆదేశానుసారం తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి, కాకి బాబు, సావాడ అప్పలరెడ్డి, ఎంపీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరం



అగ్ని ప్రమాదాల నివారణపై మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న సేఫ్టీ బృందం

పరవాడ: ఫార్మా పరిశ్రమల్లో తరచూ జరుగుతున్న అగ్ని ప్రమాదాలపై యాజమాన్యాలు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ చిన్నారావు సూచించారు. జేఎన్ ఫార్మాసిటీలో ఎస్ఎస్ఎఫ్ ఇండియా పరిశ్రమలో అగ్ని ప్రమాదాల నివారణపై గురువారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మా పరిశ్రమల్లో సంభవిస్తున్న అగ్ని ప్రమాదాల నివారణ విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రమాద సమయంలో కార్మికులు, ఉద్యోగులు పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అంతకుముందు అగ్ని ప్రమాదం సంభవిస్తే ప్రమాదాన్ని ఏ విధంగా ఎదుర్కోవాలన్న దానిపై కార్మికులు మాక్ డ్రిల్ ద్వారా కళ్లకు కట్టినట్లు చూపించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఎఫ్ ఇండియా పరిశ్రమ ఉద్యోగులు, విష్ణు కెమికల్, ఎమ్మెన్నార్, ఎంఏఎస్ఈఆర్ఎం ప్రతినిధులు, భద్రత అధికారులు పాల్గొన్నారు.